క్లుప్తంగా

నేడు విద్యుత్ భవన్ ఎదుట నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నేడు విద్యుత్ చార్జీల సర్దుబాటు ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన చేపడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వసతి గృహానికి వాటర్ క్యాన్లు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని మా అమ్మఒడి అనాథ బాలల వసతి గృహానికి ఆదివారం దాతలు సంతోష్, ఉదయభాస్కర్ నీటి క్యాన్లు, 36 లీటర్ల ఫినాయిల్ బాటిళ్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని భావిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తమవంతుగా తోడ్పాటు అందిస్తామని వారు వివరించారు.

శిల్పారామంలో అందెల సవ్వడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కడప నగరానికి చెందిన ముద్ర డ్యాన్స్అకాడమి నిర్వాహకులు, నృత్య గురువు విజయశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. అలాగే జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది.

నామినేటెడ్ పదవుల్లో బలిజలకు అన్యాయం

కడప కల్చరల్ : కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి కడప జిల్లా వాసులకు నామినేటెడ్ పదవుల్లో బలిజలకు తీవ్ర అన్యాయం జరిగిందని శ్రీ కృష్ణదేవ రాయ బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) అధ్యక్షులు దాసరి శివప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన సభ్యులు కొమ్మినేని చంద్ర శేఖర్, సుమలపు సుబ్బయ్య, గుంటి శ్రీకాంత్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2014 -2019 టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి కడప జిల్లాలో బలిజలకు న్యాయం జరగలేదని, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో కూడా బలిజలకు మొండిచేయి చూపడం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎందరో బలిజలకు మంత్రి పదవులుపపాటు కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వడమే కాకుండా పలు రాష్ట్ర కార్పొరేషన్లలో డైరెక్టర్ పదవులు తదితర పదవులు కట్టబెట్టి బలిజలకు గుర్తింపు ఇచ్చారన్నారు. బలిజల నాయకులకు కనీసం గుర్తింపు ఇవ్వకపోడం అభిమానులను కలిచి వేస్తోందన్నారు.

దుర్గమ్మ ఆలయంలో శాంతి కల్యాణం

కడప కల్చరల్ : విజయ దుర్గాదేవి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మాసోత్సవాలలో భాగంగా రెండవ ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదారులైన దంపతులు అర్చకుల సూచనల మేరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఈ సందర్భంగా విశేష అభిషేకాలు నిర్వహించి అనంతరం వారిని కల్యాణమూర్తులుగా నూతన వస్త్రాలు అలంకరించి కల్యాణ పీటలపై కొలువుదీర్చారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మౌలానా ఎడ్యుకేషన్ సొసైటీ సేవలు ప్రశంసనీయం



మౌలానా సొసైటీ అధ్యక్షుడు షబ్బీర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ముక్తార్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్ : మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి అన్ని విధాలుగా సేవలందిస్తున్న మౌలానా సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ అని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్నారు. ఆదివారం కడప నగరంలోని ఆఫ్సర్ కాలనీలోని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో దేశం ప్రప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్‌ను సన్మానించి, ప్రశంసపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ బాబు భాయ్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటాక్ బాలల దినోత్సవం

కడప కల్చరల్ : చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం ముందస్తు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి తెలిపారు. కడప నగర సమీపంలోని నగర వనంలో ఉదయం 8.30 నుంచి బాలల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

దేశభద్రత.. అగ్నివీర్‌ల భవిత

త్రివిధ దళాల్లో పనిచేయాలన్న సంకల్పం.. దేశానికి సేవాచేయాలన్న తపన.. అగ్నివీర్‌లుగా చేరాలన్న ధృడనిశ్చయం వారిని ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీవైపు నడిపాయి. ఇప్పటికే అగ్నివీర్ ఆర్మీరిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌ల కోసం నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన యువత కడప నగరానికి విచ్చేశారు. వీరిని సాక్షి పలుకరించగా పలు విషయాలను పంచుకున్నారు.

– కడప స్పోర్ట్స్



కడప నగరానికి చేరుకున్న అగ్నివీర్ అభ్యర్థులు

దేశానికి సేవాచేయాలన్నదే లక్ష్యం..



చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలన్నది నా కల. దీంతో ఆర్మీరిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి దరఖాస్తు చేసుకుని పరీక్షరాసి ఉత్తీర్ణత సాధించాను. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు సైతం సన్నద్ధమయ్యాం. జనరల్ డ్యూటీ పోస్టు సాధించేందుకు ర్యాలీకి విచ్చేశాను.

– ప్రవీణ్, ఆదోని, కర్నూలు జిల్లా

జనరల్ డ్యూటీ ఉద్యోగం కోసం వచ్చాను..



ఆర్మీలో జనరల్ డ్యూటీ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ర్యాలీకి వచ్చాను. ఉద్యోగం సాధిస్తామన్న నమ్మకం ఉంది. ఒక్కరోజు ముందుగానే ఇక్కడికి చేరుకున్నాం. ఆర్మీలో చేరడం ద్వారా దేశానికి సేవచేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాం.

– మహమూద్, నంబూరు, గుంటూరు జిల్లా

అగ్నివీర్‌లో చేరాలని..



కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అగ్నివీర్‌లో చేరాలని గత కొద్దిరోజులుగా బాగా సాధన చేస్తున్నాం. రాత పరీక్షను క్లియర్ చేశాం. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిచేస్తామన్న నమ్మకం ఉంది. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి. – హేమంత్‌కుమార్, పుంగనూరు, చిత్తూరు జిల్లా

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఏర్పాట్లు బాగున్నాయి..



అగ్నివీర్ ఆర్మీరిక్రూట్‌మెంట్ ర్యాలీకి విచ్చేసిన అభ్యర్థులకు అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఒక క్రమపద్ధతి ప్రకారం పాల్గొనే అవకాశం కల్పించారు. ఆర్మీలో చేరాలన్నదే నా లక్ష్యం.

– రాజేష్, నెల్లూరు

అగ్నివీర్‌లుగా ఎంపికవ్వాలని..



దేశానికి సేవచేసే సైనికులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంది. అంతటి ప్రాధాన్యత కలిగిన సైనికునిగా పనిచేయడం అనేది మా కల. ఇందుకోసం బాగా సాధన చేస్తున్నాం. అగ్నివీర్ ద్వారా దేశసైన్యంలో పనిచేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాం. ఎంపికవ్వాలన్న లక్ష్యంతో కష్టపడుతున్నాం.

– నందు, మల్లికార్జున, గుంతకల్లు, అనంతపురం జిల్లా

కాలి నడకతో అనారోగ్యాలు దూరం

మెగా వైద్య శిబిరంలో నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి



ఉచిత మెగా వైద్య శిబిరంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : మానవ జీవితంలో కాలి నడక ప్రధానమైనదని, ప్రతిరోజు నడిస్తే ఏ అనారోగ్యాలు దరిచేరవని కడప మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోజ్ రెడ్డి అన్నారు. మెగావిన్ వాస్కులర్ కేర్ ఆధ్వర్యంలో ఏపీయుడబ్ల్యూజే కడప జిల్లా శాఖ సౌజన్యంతో ఆదివారం ఇక్కడి ప్రెస్ క్లబ్ లో వెరికోస్ వెయిన్ ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. మెగా విన్ వాస్కులర్ కేర్ ఇటువంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నడక ఆవశ్యకతను గుర్తించి నగరంలో అన్ని మున్సిపల్ కార్పొరేషన్ పార్కులలో నడకకు వీలుగా పలు మరమ్మతులు చేయించామన్నారు. రానున్న కాలంలో మరిన్ని సౌకర్యాలు అందుబాటులో తీసుకొస్తామని ఆయన తెలిపారు .పాత్రికేయులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి సామాజిక బాధ్యతను గుర్తు చేశారని, అధికారులు కూడా తమ దైనందిన విధులతో పాటు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని అన్నారు. ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక వైద్య నిపుణులు రప్పించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఆనందాన్ని కలిగించిందన్నారు. వాస్కులర్ కేర్ వైద్యులు డాక్టర్ పి. విజయ్ కుమార్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్ రాజ్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ శివరాం, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఆంజనేయులు, నాగరాజు, ఉపాధ్యక్షుడు రవి కుమార్, ఐజేయూ సభ్యులు రామాంజనేయరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లాగౌరవ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్ర, సర్దార్, కెమెరామన్ల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మనోహర్, చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద ఏపీ 104 మొబైల్ మెడికల్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించామన్నారు. సంవత్సరాల తరబడి 104 ఉద్యోగులు పనిచేస్తున్నా వేతనాలు పెరగకపోవడం దారుణమని తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏజెన్సీలు మారడం, ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 మంది పైలెట్లు, 40 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పని చేస్తుండగా, వీరికి చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ఆరోపించారు. గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోగా ఉద్యోగులకు భద్రత, రక్షణ లేకపోవడం సరైంది కాదన్నారు. గ్రామాల్లో వెళ్లి ప్రజలకు మందులు అందించడంలో వీళ్ళ పాత్ర కీలకమైనదని తెలిపారు. వీరి విషయంగా ప్రస్తుతం ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానమైన పని సమాన వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని, పీఎఫ్ 25 శాతం ఉద్యోగుల ద్వారా వసూలు చేయడం విరమించాలన్నారు. వీరి సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య,104 యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ అలీ, నాగేంద్ర, రమణ జిల్లా వ్యాప్తంగా పైలెట్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

11న ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు పేదలకు దక్కేంతవరకు పోరాటం సాగిస్తామని, అందుకోసం ఈనెల 11వ తేదీన కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కే మునెయ్య గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు అర్హులైన పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి ఓట్లు పొంది అధికారంలోకి రాగానే విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. పేదవాడికి రెండెకరాల సాగభూమి, 3 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు అధికార పార్టీ నేతల మాటున డీకేటీ మాఫియాకు విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, ఈనాం, వక్ఫ్ భూములను కట్టబెట్టి కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. అసైన్మెంట్ కమిటీ నిర్వహించి అర్హులైన పేదలకు భూ పంపిణీ జరగపోవడం విచారకరమన్నారు.

ప్రేమాలయలో అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : హిమ వర్షిణి ఫౌండేషన్ గౌరవ సలహాదారు నాగుల రాంప్రసాద్ తన తల్లి వర్ధంతి సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. స్థానిక ప్రేమాలయ వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రెడ్డి లక్ష్మణ్, వెంకట సురేష్, టైలర్ రవి, ఎలక్ట్రీషియన్ మధు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూగర్భ నీటి వనరుల సుస్థిరత నిర్వహణపై శిక్షణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 11నుంచి 13 తేదీ వరకు 'భూగర్భ నీటి వనరుల సుస్థిరత' నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎర్త్ సైన్సెస్ విభాగం విభాగాధిపతి ఆచార్య టి. శివ ప్రతాప్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె. రఘుబాబు తెలిపారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి శిక్షణ తరగతులు ప్రారంభిస్తారని, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ జి. కృష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి, భూగర్భ జల శాఖ నుంచి ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్, రివర్ డెవలప్మెంట్, గంగా పునరుజ్జీవనం, జల్ శక్తి మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం కడపలో జిల్లాలో ఆక్విఫర్ మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టి సారించిదన్నారు. (సి.జి.డబ్ల్యూబి) విజయాలు ఈ కార్యక్రమం ద్వారా చర్చిస్తారన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియాలజీ, డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, స్థానిక జిల్లా భూగర్భజలశాఖ అధికారులు, గ్రామీణ నీటి సరఫరాకు చెందిన ఇంజనీర్లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ట్రైనీలుగా పాల్గొని ప్రయోజనాలను పొందనున్నారని ఆచార్య శివప్రతాప్ తెలిపారు.

విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ కృషి ఎనలేనిది



మౌలానా అజాద్ పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యావేత్తలు

కడప ఎడ్యుకేషన్ : దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అజాద్ విద్యాభివృద్ధికి అందించిన కృషి ఎనలేనిదని ఇంటర్నేషన్ గ్రూపు ఎస్ఎండీ రఫీ అన్నారు. 11వ తేదీ జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడపలో మౌలానా అజాద్ జీవిత చరిత్ర పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు, మహానేత మౌలానా అజాద్ దేశ తొలి విద్యాశాఖమంత్రిగా పనిచేసి దేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. దేశంలో ఎన్నో విద్యాసంస్థలు, యూనివర్సిటీలను నెలకొల్పారన్నారు. అలాగే విద్యావ్యవస్థలో సుస్థిరమైన మార్పులకు ప్రేరణ ఇచ్చిన మహానేత అన్నారు. ఆయన ఆలోచనలను ప్రస్తుత తరానికి చేరువ చేయడం మన బాధ్యత అన్నారు. ఈ పోస్టర్ ద్వారా ఆయన అద్భుతమైన జీవిత కథను అందరికి తెలియజేయాలని సంకల్పించాం అని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్తలు మొహమ్మద్ సీకందర్ హుస్సేన్, మొహమ్మద్ అబ్బాస్,మొహమ్మద్ హుస్సేన్ మరియు మొహమ్మద్ జాహిద్ పాల్గొన్నారు

టిప్పు సుల్తాన్ సేవలు మరువలేనివి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బ్రిటీష్ పాలకులను గజగజలాడించిన స్వాతంత్య్ర సమరయోధుడు, టిప్పు సుల్తాన్ సేవలు మరువలేనివని ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో టిప్పు సుల్తాన్ 274వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన టిప్పు సుల్తాన్ జయంతిని, వర్ధంతి సభలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. దేశ చరిత్రను, స్వాతంత్రం కోసం పోరాటం చేసిన వీరుల చరిత్ర తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. టిప్పు సుల్తాన్ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా అనేక యుద్ధాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు నూరుల్లా ,షరీఫ్, నగర అధ్యక్షులు ఆబిద్ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బయ్య మృతికి నివాళి



సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ సురేష్ బాబు, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరం 2వ డివిజన్ చలమారెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లం సుబ్బయ్య గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారి స్వగృహానికి వెళ్లి సుబ్బయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లారెడ్డి, ఆర్‌వీ రమణ, రాజా, ప్రసాద్, సుదర్శన్, శంకరాపురం సింధు, మల్లి పాల్గొన్నారు.

సీనియర్ రిపోర్టర్ ఇమామ్ మృతి తీరని లోటు

సీనియర్ రిపోర్టర్ ఇమామ్ మృతి తీరని లోటని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన గుండెపోటుతో చనిపోయిన విషయం తెలుసుకొని, వారి స్వగృహానికి వెళ్లి భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, దాసరి శివప్రసాద్, అహ్మద్, నూర్, ఫయాజ్, దస్తగిరి పాల్గొన్నారు.

క్రమం తప్పక మందులు వాడితే చక్కని ఆరోగ్యం

కడప కల్చరల్ : ఒక వయస్సు దాటిన వారు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు మందులు వాడితే ఆరోగ్యం చక్కగా ఉంటుందని హోమియో వైద్య నిపుణులు వెంకటరామ్ అన్నారు. కడప వాసవీ హాస్టల్ అధ్యక్షులు బెస్త వేముల రామమహేష్, కార్యదర్శి భవానీప్రసాద్, కోశాధికారి నిరంజన్, చింతకుంట పుల్లయ్య తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 250 మందికి పైగా దీర్ఘకాలికంగా మోకాళ్ల నొప్పులు, కీళ్లవాతం, జాయింట్ల సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు మందులు ఉచితంగా అందజేశారు. అలాగే పంటి సమస్యలకు సంబంధించి కూడా పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు తగిన సహకారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, రెడ్డిబాబు, రామ్మోహన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

'ఏపీజీఈఏ'ను సొంత ప్రయోజనాల కోసం తాకట్టు

- ఈ సంఘం ఎవరిదనేది న్యాయ స్థానం తేలుస్తుంది
- ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు



మాట్లాడుతున్న ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు

కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షులుగా చెప్పుకొనే సూర్యనారాయణ తన సొంత ప్రయోజనాల కోసం సంఘాన్ని తాకట్టు పెట్టారని ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏపీఈజీఏ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆస్కార్‌రావు మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాను నిబంధనల ప్రకారం ఎన్నికైనట్లు తెలిపారు. ఆ పదవి నుంచి తొలగించినట్లుగా తనకు ఎలాంటి ఉత్తర్వులు అందలేని తెలిపారు. అయితే తన స్థానంలో రమేష్‌కుమార్ అనే వ్యక్తిని నియమించినట్లుగా ప్రకటించడం చెల్లదన్నారు. నిబంధనల ప్రకారం సంఘ సభ్యులంతా కలిసి సూర్యనారాయణ స్థానంలో రాష్ట్ర అధ్యక్షులుగా డీ శ్రీకాంత్‌రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. సంఘానికి సంబంధించిన అంశాలు కోర్టు పరిధిలో ఉన్నాయని, సంఘం ఎవరిదనేది న్యాయస్థానం చెబుతుందన్నారు.

జిల్లా నూతన కమిటీ

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా టీ విన్సెంట్‌కుమార్, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్ తాసిద్, కార్యదర్శిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా జీ చంద్రశేఖర్, జీ భాస్కర్, వరప్రసాద్, ఎం శివ, సంయుక్త కార్యదర్శులుగా నాగేశ్వరి, ఎం విజయలక్ష్మి, లక్ష్మీదేవి, రామసుబ్బారెడ్డి, సీ ఏసుపాదం, ఎస్ సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణలను ఎన్నుకున్నారు.

అభ్యంతరం వ్యక్తం చేసిన సూర్యనారాయణ వర్గం

అంతకుముందు సూర్యనారాయణ వర్గం సంఘం సమావేశంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్‌తో పాటు జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, రఘురామ్‌లు మాట్లాడుతూ తమ సంఘం పేరుతో సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.